ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 18 ఫిబ్రవరి 2024

జడ్పీ హైస్కూల్లో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషేక్ కిశోర్



పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ అభిషేక్ కిశోర్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: మదనపల్లె నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. శనివారం మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు, విద్యుత్ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి వచ్చేందుకు తప్పనిసరిగా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఒకే కళాశాల, హైస్కూళ్ల పరిధిలో ఎన్ని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ మరమ్మతులు వేగవంతం చేయాలని, నియోజకవర్గంలోని మూడు మండలాలు, అర్బన్ ప్రాంతాలకు తీసుకెళ్లే ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాల పంపిణీ, ఎన్నికల తరువాత తీసుకొచ్చే ఈవీఎంలు, వీవీప్యాట్‌లను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రంగా ఉంచాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫారం-6, 7, 8లను పరిశీలించి, తుది ఓటర్ల జాబితా తరువాత మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలని ఆర్డీవో హరిప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి కురబలకోట మండలం అంగళ్లు వద్ద మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల పంపిణీ, స్వీకరణ, వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఈఆర్వో రాఘవేంద్రకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, సెక్టోరియల్ అధికారులు, పాల్గొన్నారు.

సీటీఎం పంచాయతీలో అటవీ శాఖ భూముల్లో ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం



అటవీ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న అటవీ, రెవెన్యూ శాఖాధికారులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: మదనపల్లె మండలం సీటీఎం-2 (క్రాస్ రోడ్డు) పంచాయతీ పరిధిలో రూ2 కోట్ల విలువైన అటవీ శాఖ భూములను కొందరు కబ్జా చేసేందుకు యత్నించారు. గ్రామ ప్రజలు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే... సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సర్వే నెంబర్లు 684ఏ, 684బీలో 51 సెంట్ల అటవీ శాఖ భూములున్నాయి. ఇటీవల ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో కొందరు అక్రమార్కుల కన్ను అటవీ శాఖ భూమిపై పడింది. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి ఎక్స్‌కవేటర్ పెట్టి చదును పనులు చేయడంతో పాటు, అక్కడి మట్టిని ట్రాక్టర్లతో వేరే ప్రాంతానికి తరలించడం మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మదనపల్లె ఎఫ్ఆర్వో మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు డీఆర్వో మదనమోహన్, ఎఫ్‌బీవోలు శోభారాణి, సుబ్బలక్ష్మిలు సీటీఎం వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను అడ్డుకున్నారు. వీఆర్వో సదాశివ కూడా అక్కడికి చేరుకోవడంతో ఆ భూమి వివరాలను రికార్డుల్లో పరిశీలించారు. 684ఏ సర్వే నెంబర్లో 23 సెంట్లు, 684 బీ సర్వే నెంబర్‌లో 28 సెంట్ల భూమి రిజర్వు ఫారెస్ట్‌గా రికార్డులు చూపుతున్నాయి. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అటవీశాఖ భూముల్లో ఎవరూ ప్రవేశించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ భూమిలో హెచ్చరిక బోర్డు నాటుతామని డీఆర్వో హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవోలు హరిశంకర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కబ్జా యత్నాన్ని అడ్డుకున్న అధికారులు

'సిద్ధా'నికీ.. డ్వాక్రా మహిళలే..

- ఆర్టీసీ బస్సులన్నీ అక్కడికే..
- బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు
- 335 ఆర్టీసీ బస్సులు.. 205 ప్రైవేటు స్కూల్ బస్సులు
- రాప్తాడు సీఎం సభకు తరలింపు



మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో బస్సులు లేక పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



రాజంపేట బస్టాండులో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

రాయచోటి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలోని రాప్తాడులో ఆదివారం సీఎం జగన్ నిర్వహించనున్న సిద్ధం బహిరంగసభకు జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేసేందుకు వైసీపీ నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ స్కూళ్ల బస్సులను కూడా జనాల తరలింపునకు వాడుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా బస్సులను రద్దు చేయడంతో బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణీకులు గంటల తరబడి వేచి చూశారు. పల్లెలకు వెళ్లే వారు బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణీకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు జిల్లా నుంచి అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలను తరలిస్తున్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో ఎక్కడ బటన్ నొక్కే కార్యక్రమాన్ని చేపట్టినా లబ్ధిదారుల కంటే ఎక్కువగా డ్వాక్రా మహిళలే ఉంటున్నారు. అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చి మరీ డ్వాక్రా మహిళలను ఈ కార్యక్రమాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చివరికి ముఖ్యమంత్రి ఎక్కడైనా ప్రైవేటు కార్యక్రమాలకు హాజరైనా డ్వాక్రా మహిళల హాజరు తప్పనిసరి. ఇదే కోవలోనే ఎన్నికల సమరానికి సమయం దగ్గర పడుతున్న సమయంలో ముఖ్యమంత్రి ఎన్నికల సమరాన్ని పూరిస్తున్నారు. సుమారు 30కి పైగా నియోజకవర్గాల పరిధిలో ఒకచోట పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తుండగా అందులో అధిక శాతం డ్వాక్రా మహిళలే ఉంటున్నారు. వారి తరలింపు బాధ్యతను డీఆర్‌డీఏ శాఖకు అప్పగించినట్లు తెలిసింది. జిల్లా నుంచి బలవంతంగా ప్రైవేటు స్కూళ్ల బస్సులను సేకరించినట్లు తెలుస్తోంది. ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలకు ఆర్టీవో అధికారులు ఫోన్ చేసి ఒత్తిడి చేసి బస్సులు తీసుకున్నట్లు సమాచారం. ఈ ప్రైవేటు స్కూల్ బస్సులు ఎన్ని సేకరించారు.? ఇంకా ఎన్ని అవసరం అవుతాయి..? అని రాష్ట్రస్థాయి అధికారి ఒకరు స్వయంగా పర్యవేక్షించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు జిల్లా నుంచి 335 ఆర్టీసీ బస్సులు, 205 ప్రైవేటు స్కూల్ బస్సుల్లో అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే ముఖ్యమంత్రి సిద్ధం సభకు జనాలు తరలుతున్నట్లు తెలుస్తోంది.

మదనపల్లెలో ఉన్న ఆర్టీసీ రెండు డిపోలకు చెందిన ఆర్టీసీ 75 శాతం బస్సులన్నీ సీఎం సభకు జనాలు తరలించేందుకు వెళ్లడంతో శనివారం మధ్యాహ్నం నుంచి ప్రయాణీకులు అగచాట్లు పడుతున్నారు. మదనపల్లె వన్ డిపోలో 117 ఆర్టీసీ బస్సులు ఉండగా 76 బస్సులను, 2వ డిపో పరిధిలో 83 బస్సులు ఉండగా వాటిలో 57 బస్సులను ఆర్టీసీ అధికారులు అనంతపురం జిల్లా రాప్తాడు సభకు మళ్లించారు. దీంతో విషయం తెలియక మదనపల్లెకు వచ్చిన విద్యార్థులు, చుట్టుపక్కల ప్రజలు ఆర్టీసీ బస్టాండు వద్ద పడిగాపులు కాస్తున్నారు. పీలేరు డిపోలోని అధిక శాతం బస్సులు 'సిద్ధం' సభకు వెళ్లిపోవడంతో శనివారం ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీలేరు డిపోలో 85 బస్సులు ఉండగా వాటిలో 62 బస్సులు సభ కోసం కేటాయించడంతో శనివారం ఉదయం 11 గంటల నుంచి అవి వెళ్లిపోయాయి. ఆ సంగతి తెలియని ప్రయాణీకులు ఎప్పటిలాగా తమ ప్రయాణాల కోసం పీలేరు బస్టాండుకు చేరుకుని తమకు కావాల్సిన బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించారు. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో చాలా మంది తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. విద్యాసంస్థలకు చెందిన బస్సులను కూడా సభకు కేటాయించాలని రవాణా శాఖ అధికారులు ఆయా యాజమాన్యాలకు హుకుం జారీ చేయడంతో అధిక శాతం పాఠశాలలు పాక్షికంగా సెలవు ప్రకటించాయి. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులను తల్లిదండ్రులే పాఠశాలల వద్ద దింపాలని సెల్‌ఫోన్‌లకు సందేశాలకు పంపారు. విద్యార్థులు, ప్రజల అవసరాల కంటే అధికార పార్టీ సమావేశాలే ముఖ్యమయ్యాయంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రాజంపేట డిపో నుంచి 54 ఆర్టీసీ బస్సులను సీఎం సభకు తరలించారు. అంతేకాకుండా ఆర్టీవో పరిధిలోని కోడూరు, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట, నందలూరులలో ఉన్న ప్రైవేటు స్కూల్ బస్సులను సైతం తీసుకున్నారు. అనంతపురం వెళ్లి వచ్చేందుకు అయ్యే డీజిల్ ఖర్చులతో పాటు ప్రతిరోజూ డ్రైవర్, క్లీనర్‌కు రూ.1500 చొప్పున బత్తా, బస్సులలో తరలిస్తున్న ప్రజలకు వైసీపీ నేతలు భోజన సదుపాయంతో పాటు ఒక్కొక్కరికీ 700 రూపాయల చొప్పున చెల్లించి ప్రజలను వారి సభలకు తరలిస్తున్నారు. శనివారమే రాజంపేట ఆర్టీసీ డిపో నుంచి 54 బస్సులను తరలించడంతో పల్లెలకు, తిరుపతి, కడప ప్రాంతాలకు వెళ్లే బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాయచోటిలో ఆర్టీసీ సర్వీసులను ఎక్కువ శాతం సీఎం సభకు కేటాయించడంతో బస్సులు లేక ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాయచోటి డిపో నుంచి 56 ఆర్టీసీ బస్సులు, 30 ఆర్టీసీ హైర్ బస్సులు కలిపి 86 బస్సులను రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించే సిద్ధం బహిరంగసభ తరలించినట్లు ఆర్టీసీ డీఎం తెలిపారు. బస్సులు లేని విషయం తెలియని ప్రయాణీకులు బస్సుల కోసం బస్టాండులో గంటల తరబడి వేచి చూశారు. ప్రయాణీకులతో పాటు విద్యార్థులు బస్సులు లేక అనేక ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా బస్సులను రద్దు చేయడంపై ప్రయాణీకులు ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



పీలేరు బస్టాండులో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణీకులు



రాయచోటి ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణీకులు

మదనపల్లెలో పాయల్ రాజ్‌పుత్ సందడి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17 : ప్రముఖ సినీ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ శనివారం మదనపల్లెలో సందడి చేశారు. జోస్ అలుక్కాస్ జ్యువెలరీ షోరూంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయల్‌ను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలిరావడంతో మదనపల్లెలో సందడి వాతావరణం నెలకొంది.



దివ్యాంగుల విద్యాభివృద్ధికి డిజిటల్ విద్య

- జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 17: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధనలో డిజిటల్ విద్యను ఉపయోగించడం ద్వారా సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుందని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలో సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త జనార్ధన్ ఆధ్వర్యంలో విజన్-2025 ఇంక్లూజివ్ ఆంధ్ర డిజిటల్ మీద ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని విద్యార్థులకు అందించాలన్నారు. జిల్లాలోని 90 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు, 77 మంది సహిత విద్యా ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఇచ్చామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రాష్ట్ర సమగ్ర శిక్ష రీసోర్స్ పర్సన్‌లుగా వచ్చిన బి.మహాలక్ష్మి, నాయుడు, సునీల్‌లు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇచ్చిన ట్యాబ్స్ ఎలా ఉపయోగించాలి, ఈ ట్యాబ్స్‌లో అప్‌లోడ్ చేసిన 33 రకాల యాప్‌లను ఉపయోగించి ఏ విధంగా బోధించాలి, దృష్టి లోపం కలిగిన దివ్యాంగ విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఎవరి సహాయం లేకుండా స్వతంత్రంగా తమ పనులు తాము చేసుకోవడానికి ఈ యాప్‌లు ఏ విధంగా ఉపయోగపడతాయో ప్రాక్టికల్స్ చేయించి అవగాహన కల్పించారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ అజయ్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పర్చుకుని విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈ ఆర్టీలు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

ఎన్నికల వేళ శంకుస్థాపనల గోల..

- కోడూరు పట్టణంలో హుటాహుటిన శంకుస్థాపనలు
- మొదలు కాని పనులు..
- హడావిడంతా ఎన్నికల కోసమే అంటున్న ప్రజలు



శిలాఫలకానికే పరిమితమైన గుంజనేరు ప్రొటెక్షన్ వాల్

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 16: పట్టణంలో చూస్తుంటే అప్పుడే ఎన్నికల హడావిడి మొదలైనట్లు ఉంది. ఐదు సంవత్సరాల నుంచి గుర్తుకు రాని కోడూరు ప్రధాన సమస్యలు ఇప్పుడే గుర్తుకొచ్చినట్టు ఉంది ఆ ప్రజాప్రతినిధికి. హుటాహుటిన రెడ్డివారిపల్లి బ్రిడ్జి, గుంజనేరు ప్రొటెక్షన్‌వాల్, బుడుగుంటపల్లె వెళ్లే రైల్వే అండర్‌బ్రిడ్జి పనులకు వెంటవెంటనే శంకుస్థాపనలు చేశారు. అధికారంలోకి రాగానే ముందుగా మన గ్రామానికి వెళ్లే రెడ్డివారిపల్లె బ్రిడ్జి పనులను ప్రారంభిస్తాను అని చెప్పిన ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల తరువాత సొంత గ్రామంలో తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం నుంచి రూ.12 కోట్ల నిధులు మంజూరు చేయించి ఈ ఏడాది పనులను ప్రారంభించారు. ముందు సాఫీగా సాగిన పనులు ప్రస్తుతం నత్తనడకగా సాగుతున్నాయి. నవంబరులో కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి పనులు ఆగిపోయాయి అనంతరం నీళ్ల తాకిడి పూర్తిగా తగ్గుముఖం పట్టినా పనులు మొదలు పెట్టలేదు. ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నేతల నుంచి విమర్శలు రావడంతో ఇటీవల పనులు మొదలుపెట్టారు. ఇకపోతే చెల్లికి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ అన్నట్లు ఉంది బుడుగుంటపల్లెకి వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి పరిస్థితి. గత ఏడాది రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేసిన కాంట్రాక్టర్ కొంత మేర సామగ్రిని తరలించినా పనులు మొదలు కాలేదు. 26 గ్రామాల ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో నిధులు మంజూరు చేయించి గత ఏడాది నవంబరులో కొత్త కాంట్రాక్టర్‌తో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కానీ ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. అలాగే గుంజనేరు ప్రొటెక్షన్ వాల్‌కు గత ఏడాది రూ.30 కోట్లు నిధులు మంజూరైనా పనులు మొదలు కాలేదు. ఎన్నికలు సమీపించడంతో హుటాహుటిన ఈ ఏడాది జనవరి 31వ తేదీ తిరిగి శంకుస్థాపన చేసినా పనులు మాత్రం ఇంతవరకు ప్రారంభించలేదు.

ప్రజలకు బయోస్కోప్ చూపిస్తున్న ఎమ్మెల్యే



ఎన్నికలు సమీపించడంతో హుటాహుటిన రైల్వేకోడూరు ప్రధాన సమస్యలకు శంకుస్థాపనలు చేసి మేము ఇచ్చిన మాట ప్రకారం పనులు మొదలుపెట్టి పూర్తి చేస్తాం అని రైల్వేకోడూరు ప్రజలకు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బయోస్కోప్ చూపిస్తున్నారు. నాలుగు సంవత్సరాలు గుర్తుకు రాని పనులు ఇప్పుడే గుర్తుకు వచ్చాయా, పనులు మంజూరైన ఇన్ని రోజులు ఎందుకు మొదలు కాలేదో రైల్వేకోడూరు ప్రజలకు బాగా తెలుసు. ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో మాయమాటలతో సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు చేసే పనులు నమ్మవద్దని స్వయాన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చెప్పారు. ఇప్పుడు మీరు చేసిన శంకుస్థాపనలను ప్రజలు ఎలా నమ్ముతారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు మీకు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది.

- పంతగాని నరసింహప్రసాద్,
టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు



ఇంతవరకు పనులు మొదలుపెట్టని రైల్వే అండర్ బ్రిడ్జి



నత్తనడకన సాగుతున్న రెడ్డివారిపల్లె బ్రిడ్జి పనులు

అశ్వవాహనంపై అభయప్రదాత

కడప (కల్చరల్), ఫిబ్రవరి 17: దేవుని కడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు సర్వభూపాల వాహనంపై, రాత్రి 8 గంటలకు అశ్వవాహనంపై కోనేటిరాయుడు భక్తులకు అభయమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, క్రిష్ణమోహన్ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం, ఊంజల్ సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమలేశుడు మాడ వీధుల గ్రామోత్సవంలో కోలాటాలు, చెక్కభజనలతో భక్తులు ఆనంద డోలికల్లో తేలియాడారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తనలు, హరికథా గానం భక్తులను ఎంతగానో అకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగుల సొమ్ము దోచుకున్నారు

- టీ, బిస్కెట్ చర్చలు తప్ప చెల్లింపులు లేవు
- ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలే శరణ్యం
- కలెక్టరేట్ ఎదుట జేఏసీ నేతల హెచ్చరిక

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి17: ఉద్యోగులు తినోతినకనో ఏళ్లతరబడి దాచుకున్న సొమ్మును అవసరాలకు చెల్లించకుండా రూ.20 వేల కోట్లు ప్రభుత్వం వాడుకోవడం దుర్మార్గమని, వెంటనే చెల్లింపులు చేయాలనీ ఏపీ జేఏసీ నేతలు బి.శ్రీనివాసులు, నాగిరెడ్డి, లక్ష్మీరాజా, రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న సొమ్మును అడిగితే ముఖ్యమంత్రికి గానీ, ప్రభుత్వ అధికారులకు గానీ చీమ కుట్టినట్టుగా కూడా లేదన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. కనీసం ఎన్నికల సమయంలో అయినా సమస్యలు తీరతాయని భావిస్తే చర్చల పేరుతో టీ బిస్కెట్లతో సరిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించక పోతే తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమని, చలో విజయవాడ విజయవంతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య, జేఏసీ నాయకులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, బాలపుల్లయ్య, నిర్మలా జ్యోతి, గౌరి, కాటమయ్య, అరుణమ్మ, కృష్ణకుమారితో పాటు పెద్దఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

మొదటి బహుమతి కైవసం చేసుకున్న మైదుకూరు వృషభాలు

నందలూరు, ఫిబ్రవరి 17: భోగాంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహి ంచిన బండలాగుడు పోటీలను తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, జనసేన నాయకుడు అతికారి కృష్ణ ప్రారంభించా రు. ఈ పోటీలలో మైదుకూరు కుర్రా వెంకటేష్ యాదవ్ ఎద్దు మొదటి స్థానంలో నిలిచి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి విరాళంగా అందజేసిన 50 వేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు. కడప జిల్లా మూలపల్లె, మూలప్రసాద్‌రెడ్డి ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి చమర్తి జగన్ మోహన్‌రాజు అందజేసిన రూ. 40 వేలు కైవసం చేసుకున్నారు. గోసులవారిపల్లె వెంకటరమణారెడ్డి వృషభాలు మూడవ స్థానంలో నిలిచి మేడా విజయశేఖర్‌రెడ్డి ప్రకటించిన రూ. 30వేల రూపాయలు అందుకున్నారు. కొట్టాలపల్లి రవి ఎద్దు నాల్గవ స్థానం, చాపాడు గ్రామం స్వామి ఈతాల రెడ్డి ఎద్దులు ఐదవ స్థానంలో నిలిచాయి. నూకినేనిపల్లెకు చెందిన డాక్టర్ గణపతి శంకర్, సంభావు చంద్రశేఖర్, లక్ష్మయ్యల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగగా, గుత్తికి చెందిన నారాయణ స్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రాత్రికి కుంపిణీపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేలారే రేలా కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు చంద్రయ్య, దిలీప్ కుమార్‌లు బందోబస్తు నిర్వహించారు.



పోటీల్లో బండను లాగుతున్న ఎద్దులు

నేటి నుంచి ఆంధ్రా-రైల్వే జట్ల క్రికెట్ మ్యాచ్

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 17: నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 18వ తేదీ ఆదివారం నుంచి 21వ తేదీ వరకూ కల్నల్ సి.కె.నాయుడు ట్రోఫీలో భాగంగా అండర్-23 గ్రూప్ క్రీడాకారుల క్రికెట్ మ్యాచ్ జరుగుతుందని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. నాలుగు రోజుల పాటు జరగనున్న క్రికెట్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచేందుకు రెండు జట్ల క్రీడాకారులు చాలా ఉత్సాహంగా సిద్ధమైనట్లు వెల్లడించారు.

ఉర్దూ డిగ్రీ కళాశాల.. ఉత్తిదేనా?

- సీఎం హామీ ఇచ్చి రెండేళ్లయినా అతీగతీ లేదు
- ఇంటర్‌తో చదువు మానేస్తున్న ఉర్దూ విద్యార్థులు
- ఈ విద్యా సంవత్సరమైనా ఏర్పటయ్యేనా..

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 17: జిల్లాలో కడప తర్వాత ఎక్కువ మంది ముస్లిం మైనారిటీలు ప్రొద్దుటూరులో ఉన్నారు. పట్టణంలో ఉన్న వనరులను దృష్టిలో ఉంచుకుని చుట్టుపక్కల నియోజకవర్గాలకు చెందిన ముస్లిం మైనారిటీలు ప్రొద్దుటూరుతో అనుబంధం ఏర్పరచుకున్నారు. ప్రొద్దుటూరులో 60 వేల వరకు ముస్లిం జనాభా ఉంది. ముస్లిం మైనారిటీ విద్యార్థుల కోసం ఇక్కడ 10 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు, 2 యూపీ ఉర్దూ పాఠశాలలు, మూడు ఉర్దూ ఉన్నత పాఠశాలలు, ఒక ఉర్దూ జూనియర్ కళాశాల ఉన్నాయి. ఆపై ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఉర్దూ మీడియం కళాశాలలు లేక విద్యార్థులు అర్థాంతరంగా చదువులు చాలిస్తున్నారు.

ప్రొద్దుటూరులో ఉన్న ఉర్దూ జూనియర్ కళాశాలకు, పట్టణంతోపాటు ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, రాజుపాళెం, చాపాడు ప్రాంతాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారు. వీరిలో చాలామంది ఇంటర్ పూర్తయ్యాక డిగ్రీ చదవడానికి అవకాశం లేక చదువు ఆపేస్తున్నారు. కొందరు విద్యార్థులు విద్యపై ఆసక్తితో ఇంగ్లీషు మీడియం లేదా తెలుగు మీడియంలో చదువును కొనసాగిస్తున్నారు.

2022లోనే ప్రారంభిస్తామన్నారు

ప్రభుత్వం ఉర్దూ రెండవ అధికార భాషగా గుర్తించినా భాషాభివృద్ధికి అవసరమైన వసతులను కల్పించడం లేదు. చిన్న పట్టణమైన మైదుకూరులో ఉర్దూ లైబ్రరీ, ఉర్దూ కంప్యూటర్ సెంటర్లు ఉండగా, ప్రొద్దుటూరులో ఉర్దూ లైబ్రరీ లేకపోవడం గమనార్హం. 2021లో ప్రొద్దుటూరులో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీ నాయకుల కోరిక మేరకు ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2022 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తామని, కళాశాల ఏర్పాటుకు సొంత స్థలం కేటాయిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రకటించారు. దీంతో కొంత మంది ముస్లిం మైనారిటీ నాయకులు, కొందరు మత పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అయితే ముఖ్యమంత్రి హామీ ఇచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటికీ కళాశాల ఏర్పాటు చేయలేదని ఉర్దూ మీడియం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉర్దూ భాషాభివృద్ధిపై చిన్నచూపు తగదని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి అయినా ఉర్దూ డిగ్రీకళాశాల ప్రారంభించి ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని కోరుతున్నారు.



ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల

ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలి..



రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినా ఇంతవరకు ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అయినా తరగతులు ప్రారంభించి ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలి.

- జహీర్, విద్యార్థి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

ఇంటర్‌తోనే చదువు మానుకోవాల్సి వస్తోంది..



ఉర్దూ మీడియం డిగ్రీ కళాశాల లేకపోవడంతో బాలికలు ఇంటర్‌తోనే చదువు మానుకుంటున్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ప్రొద్దుటూరులో ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి మైనారిటీల అభివృద్ధికి కృషి చేయాలి.

- హర్షాద్, విద్యార్థి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

స్కూటర్ ఢీకొని విద్యార్థులకు గాయాలు

సుండుపల్లె, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని మడితాడు పంచాయతీ జీకే రాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో స్కూటర్ ఢీకొని ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. శనివారం ఉదయం జీకే రాచపల్లె హాస్టల్ నుంచి రోడ్డు పక్క నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళుతుండగా రాయవరం వైపు నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు మరో స్కూటర్‌ను ఢీకొట్టడంతో పాటు విద్యార్థులు పైకి దూసుకురావడంతో 9వ తరగతి చదువుతున్న తౌఫిక్, రెడ్డిగణేశ్‌లు గాయపడ్డారు. వారితో పాటు పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు వారిని సుండుపల్లె ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ విద్యార్థులు కాళ్లకు గాయాలైనట్లు గుర్తించి రాయచోటికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో ఇద్దరినీ ఆటోలో రాయచోటి ఆసుపత్రికి తరలించారు.



విద్యార్థులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

విద్యార్థులకు డీఈఓ అనురాధ సూచన

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 17: సమయాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.అనురాధ విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని నంది మండలం జడ్పీ హైస్కూల్, ఇసుకపల్లె ఎంపీపీఎస్, పెండ్లిమర్రి ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్ష కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలోని మౌలిక సదుపాయాల గురించి అడిగారు. 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై పరీక్షల గురించి వారిలో ఉన్న భయాలను అపోహలను తొలగించి మంచి సలహాలు సూచనలు ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆర్వో ప్లాంట్ పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

కుష్టు, ఎయిడ్స్‌పై వీధి నాటకాలు

నేటి నుంచి 29 వరకు అవగాహన కార్యక్రమాలు : డీఎంహెచ్‌వో

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 17: హెచ్ఐవీ ఎయిడ్స్, కుష్టు, రక్తదానం, సుఖవ్యాధులు, క్షయవ్యాధులకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాజాతా బృందాలతో వీధినాటకాలు వేయించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడ కమిషనర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ విభాగం డాక్టర్ రవిబాబు, డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో కళాజాతాను నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ నుంచి 29 వరకు కళాజాతా బృందాలు వీధినాటకాల ద్వారా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లయ్య, ప్రోగ్రామ్ అధికారి వి.భాస్కర్, పాజిటివ్ నెట్‌వర్క్ మహిళలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



కళాజాతా ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

పుట్టగొడుగుల పెంపకంలో శిక్షణ

వైవీయూను సందర్శించిన అనంతపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ప్రొఫెసరు చంద్రమతి శంకర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 17 : అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వైవీయూ బయోటెక్నాలజీ శాఖను శనివారం సందర్శించారు. ఆ శాఖ ప్రొఫెసరు చంద్రమతి శంకర్ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం ప్రాథమిక దశ నుంచి మార్కెటింగ్ వరకు ప్రయోగాత్మకంగా శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో గ్రామీణ ప్రాంతాల్లో సైతం పుట్టగొడుగుల పెంపకం చిన్నతరహా పరిశ్రమగా ప్రారంభించవచ్చని సూచించారు.

పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన మౌళిక వసతులు, పెట్టుబడి లాభాల గురించి వివరించారు. వైవీయు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి హాజరై శిక్షణకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 17: విద్యతో పాటు వివిధ క్రీడా విభాగాలలో కూడా బాల,బాలికలు రాణించి తద్వారా మంచి క్రీడాకారులుగా ఎదిగి క్రీడా కోటాలో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో జిల్లా 33వ కబడ్డీ సబ్ జూనియర్స్ బాల, బాలికల క్రీడా ఎంపికలు నిర్వహించారు. కడప జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య సారథ్యంలో చేపట్టిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి పలువురు బాల, బాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లా సత్తెనపల్లెలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సునీత, ట్రెజరర్ కొండయ్య, పీడీలు పద్మలత, నాగార్జునయ్య, విశ్వనాథ్, చంద్రావతి, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు వేణు, లీలావతితో పాటు పలువురు బాల, బాలికలు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అరుణకుమారి

జ్ఞానాన్ని తరతరాలకు అందించేది అక్షరం

వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 17 : జ్ఞానాన్ని తరతరాలకు అందించేది అక్షరమని, దాన్ని హస్తగతం చేయించేవారు చిరంజీవులు అవుతారని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎస్.ఈశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం గ్రాండ్ ఇన్ హోటల్‌లోని సమావేశమందిరంలో ఇంటాక్ ఆధ్వర్యంలో ఎస్.ఇలియాస్ రెడ్డి సంపాదకత్వంలో డాక్టర్ పాలెం వేణుగోపాల్ రచించిన మన స్వాతంత్రోద్యమ సంగతులు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఇంటాక్ కడప చాప్టర్ లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ జ్ఞాన విస్తృతికి సమాజాన్ని విజ్ఞాన సంపదగా తీర్చిదిద్దడానికి పుస్తకాలు దోహదపడతాయన్నారు. పుస్తకాలను మనం చదవడం మ న పిల్లలను చదివించే అలవాటు ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. పిల్ల ల్లో మార్పునకు ఇవి వెలుగులు అవుతాయన్నారు. రేపటి సమాజానికి మనం ఇచ్చే వారసత్వ సంపద విజ్ఞానంతో కూడిన పుస్తకాలేనని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ వారి ఆలోచనలు, అనుభవాలకు అక్షరరూపం ఇచ్చే రేపటి తరానికి అందించాలని కోరారు. అనంతరం మానస చిన్నపరెడ్డి మాట్లాడారు. ఇంటాక్ శాశ్వత సభ్యులు బోగాల కొండారెడ్డి, రాఘవేంద్ర వర్మ, భాస్కరవర్మ, పయ్యావుల వేణుగోపాల్, వై.చిన్నపరెడ్డి, కె.సంజీవరెడ్డి, వై.జోజిరెడ్డి, బాలయల్లారెడ్డి, వెంకటేశ్వరాచారి, గంగాధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి

శరవేగంగా గండిలో రాజగోపుర నిర్మాణం పనులు

చక్రాయపేట, ఫిబ్రవరి 17: గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో పడమటి రాజగోపురం, ప్రహరీ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఆలయ చైర్మన్ కా వలి కృష్ణతేజ, కావలి హరినాథ్, ఎం.హరి, భరత్‌రెడ్డి ఈ పనుల ను చేపట్టారు. సహా య కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పనులు వేగవంతం చేసి సకాలంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదివరకే సహాయ కమిషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ ఆలయ ప్రారంభోత్సవానికి కావాల్సిన సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో బండపరుపు, చిన్నచిన్న పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు రూ.20 కోట్ల నిధులు గండికి వెచ్చించారు. భక్తులు కూడా ఆలయం ఎప్పుడెప్పుడు ప్రారంభిస్తారా అని ఎదురు చూస్తున్నారు. గత మూడేళ్లుగా బాలాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్నారు.



పడమటి రాజగోపురం నిర్మాణానికి పనులు జరుగుతున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నందలూరు, ఫిబ్రవరి 17 : కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు, రాజంపేట మధ్యలో పంజాబీ డాబా వద్ద శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని బైకుపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మండలంలోని ఆడపూరు గ్రామానికి చెందిన కలిశెట్టి పెంచలయ్య (25), పెనగలూరు ఈశ్వరయ్య (28) బైకుపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మన్నూరు పోలీసులు మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన పెంచలయ్య, ఈశ్వరయ్య

చికిత్స పొందుతూ మహిళ మృతి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: భర్తతో గొడవ పడి ఆత్మహత్యాయత్నం చేసుకున్న యువతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మదనపల్లె మండలం కొత్తిండ్లు పంచాయతీ రంగా రెడ్డికాలనికి చెందిన చైతన్య భార్య శశికళ(28) ఇటీవల తెలిసిన వారికి డబ్బులు అప్పుగా ఇచ్చింది. ఈ విషయం తెలిసి ఆమె భర్త చైతన్య మందలించడంతో ఈనెల 15వ తేది శశికళ మనస్థాపంతో ఎలుకల మందు తినేసింది. గమనించిన కుటుంబీ కులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, రెండు రోజుల పాటు చికిత్స పొందితూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలుంటే అధికారులకు తెలపండి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నమయ్య జిల్లా కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 17: ఎన్నికలకు సంబంధించి ఏ సమస్యలైనా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్‌లో వివిధ రాజకీట పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, వెబ్ కాస్టింగ్, సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై ఏ సమస్యలు ఉన్నా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే ఫిర్యాదులపై త్వరగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

జే వడ్డెపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం



మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని సన్మానించిన జి.వడ్డెపల్లె గ్రామస్తులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 17; మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ జింకలగుంట వడ్డెపల్లెలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లె రాం ప్రసాద్ రెడ్డి బోరువేయించి తాగునీటి సమస్య తీర్చాడని గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామంలో తాగునీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోకపోవడంతో రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి ఆ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. దీంతో ఆయన రూ. లక్ష వెచ్చించి శనివారం బోరు వేయించారన్నారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ బోరు నుంచి కొళాయిల ద్వారా గ్రామానికి నీరు అందిస్తామని తెలిపారు. రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వస్తుందన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను సన్మానించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థిని ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని

సంబేపల్లె, ఫిబ్రవరి17: సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సయ్యద్ అఫ్సాన్ అనే విద్యార్థిని ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ స్కాలర్ షిప్-2024 పరీక్షలో జిల్లాలో ప్రథమ స్థానం సాధించి నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. విజయవాడలో శనివారం విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ చేతుల మీదుగా రూ.5 వేలు నగదు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

రామాపురం, ఫిబ్రవరి17: విద్యార్థులకు మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో రామకృష్ణుడు తెలిపారు. మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ శ్రీ సాయి నగర్‌లో సాయి విద్యా మందిర్ హైస్కూల్ శనివారం 10 తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామకృష్ణుడు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆశ్రమం దర్గా నిర్వాహకులు శంకరయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు



ఆక్రమణదారులను హెచ్చరిస్తున్న తహసీల్దారు

పుల్లంపేట, ఫిబ్రవరి 17: ఎంతటివారైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దారు నరసింహకుమార్ హెచ్చరించారు. కొమ్మనవారి ఎల్లె దిగువపల్లి వడ్డీ కాలనీ పక్కన సర్వే నెంబరు 98లో 40సెంట్లు ఆక్రమించి ఫెన్సింగ్ తీయడంతో, సంబంధిత పత్రాలను తీసుకురావాలని ఆక్రమణదారులకు తెలిపారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఎవరైనా వీటి జోలికి వస్తే వదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సోమశేఖర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 17: మండలంలోని కాకర్లవారి పల్లెలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గుట్టలో పేకాట ఆడుతున్న వారిని పట్టుకుని రూ.41, 583 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

జూదరుల అరెస్టు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 17 : మండలంలోని కాకర్ల వారిపల్లెలో పేకాట ఆడుతున్న 8మందిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. గుట్టలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై దాడి చేసి నుండి 41,583రూపాయలు నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య వివరించారు.

నేతలకు చెలగాటం.. ప్రజలకు ప్రాణ సంకటం

- జగనన్న సభకు భారీగా బస్సుల తరలింపు
- బస్టాండులో ప్రయాణికుల అవస్థలు
- డ్రైవర్లు, క్లీనర్లకు రూ.1500 బత్తా
- సభకు హాజరయ్యేవారికి రూ.700 కూలి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 17 : వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభలకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను, ప్రైవేటు పాఠశాలల వాహనాలను యథేచ్ఛగా వాడుకుంటున్నారు. దీంతో ప్రయాణికులు, పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతపురంలో ఆదివారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రాజంపేట డిపోకు చెందిన సుమారు 34 ఆర్టీసీ, 20 హైర్డ్ బస్సుల్లో ప్రజలకు తరలించేందుకు నిర్ణయించారు. కోడూరు, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట, నందలూరుల్లో ప్రైవేటు పాఠశాలల వాహనాలను సైతం ఈ సభలకు పంపారు. అనంతపురం వెళ్లివచ్చేందుకు అయ్యే డీజల్ ఖర్చులతో పాటు ప్రతి రోజూ డ్రైవర్, క్లీనర్‌కు 1500 చొప్పున బత్తాను నిర్ణయించారు. బస్సుల్లో తరలిస్తున్న ప్రజలకు వైసీపీ నేతలు భోజన సదుపాయంతో పాటు, ఒక్కొక్కరికీ 700 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. రాజంపేట ఆర్టీసీ డిపో నుంచి శనివారం 54 బస్సులను తరలించడంతో పల్లెలకు, తిరుపతి, కడప ప్రాంతాలకు వెళ్లేందు బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



బస్సులు లేకపోవడంతో ఖాళీగా రాజంపేట ఆర్టీసీ డిపో ఆవరణ

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఏపీ జేఏసీ నేతల డిమాండ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించడంతో పాటు రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేశారు. ఏపీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు నాలుగో రోజు ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. ప్రసాద్ యాదవ్, రాయచోటి జేఏసీ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, జీపీఎఫ్, డీఏ, పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెంచాలని, కాంట్రాక్టు ఉద్యోగుల అందరినీ రెగ్యులర్ చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిస్కరించాలని, 11వ పీఆర్‌సీ అరియర్స్ ఇవ్వాలని, ఈహెచ్ఎస్ ద్వారా అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నగదు రహిత వైద్యం అందించాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కారం కోరుతూ ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, 27వ తేదీన విజయవాడలో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి ఈశ్వరయ్య, ఎన్జీవో సంఘం నాయకులు శ్రీనివాసులు, దేవేంద్ర, శివారెడ్డి, జయరామయ్య, జయప్రకాశ్, మహదేవ, శ్రీనివాసులు, వరలక్ష్మి, పార్వతి, పద్మ, రమణ, గణేశ్, రామక్రిష్ణ, నాగరాజు, బీసీ నాయకులు గోపాల్, బాషా, వెంకటేశ్, నాగేంద్ర బాబు, నాగేశ్వర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు



లక్కిరెడ్డిపల్లె: ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లె: ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ కొండూరు బలరాంరాజు కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడురోడ్ల కూడలి వరకు వారు ర్యాలీ నిర్వహించారు. ఎస్టీయూ సంఘ కార్యదర్శి మల్రెడ్డి, ఉపాధ్యక్షుడు దేవదానం, రామకృష్ణ, విశ్వనాథ, సాయివీర్, జిల్లా ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు శాంతమ్మ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, రామచంద్ర, రహంతుల్లా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజధాని రైతుల భావోద్వేగమే 'రాజధాని ఫైల్స్'

- టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 17: రాజధాని కోసం తన పంట పొలాలను త్యాగం చేసిన అమరావతి రైతుల భావోద్వేగం రాజధాని ఫైల్స్ సినిమా అని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి రైతులపై కక్ష సాధింపులు, దండయాత్రలు అన్నీ ఈ సినిమాలో డైరెక్టర్ క్లుప్తంగా చూపించారన్నారు. పట్టణంలోని లవ థియేటర్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు ఉచిత ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు ప్రజలందరూ ఈ సినిమా చూసి రాజధాని రైతులకు సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు మహిళ నాయకురాలు అనితా దీప్తి, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా భాష, ఓబులవారిపల్లి మండల అధ్యక్షులు వెంకటేశ్వరరాజు, కోడూరు మాజీ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు కమతం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వర స్వామికి పూజలు

రైల్వేకోడూరు: రాష్ట్రంలో టీడీపీకి 170 స్థానాలు రావాలని కోరుకుంటూ పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గెలవాలని శ్రీవారిని కోరుకున్నామని తెలిపారు. కాకతీయ సేవా సమితి కమ్మ భవన్ శంకుస్థాపనకు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు తదితరులకు జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడు గొల్లపూడి శివనారాయణచౌదరి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మాచినేని విశ్వేశ్వర నాయుడు, బీసీ నాయకుడ కమతం నాగరాజుయాదవ్, రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్నా, మహిళా నాయకురాలు దుద్యాల అనితదీప్తి, టీడీపీ సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, నాయకులు కొల్లా నరసింహులు, మారోతు మల్లి, నాగినేని నవీన్, కాకర్ల నాగేశ్వరనాయుడు, రైల్వేకోడూరు పట్టణ అధ్యక్షుడు పోకల మణి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం కార్యదర్శి బుంగటావుల రాజశేఖర్, యువ నాయకుడు కస్తూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు ప్రసన్న వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కస్తూరి

జగన్ ఓటమి.. చంద్రబాబు విజయం తథ్యం

- జీఎన్ నాయుడు, పోలి సుబ్బారెడ్డి జోస్యం

రాజంపేట, ఫిబ్రవరి 17: రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి ఓడిపోవడం, తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని టీడీపీ సీనియర్ నేత రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎస్ నాయుడు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి వెల్లడించారు. డాక్టర్ జీఎస్‌నాయుడు రాజంపేటకు వచ్చిన సందర్భంగా రీజెన్సీ నలందా ప్రాంగణంలో పోలి సుబ్బారెడ్డి శనివారం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తనకు రాజంపేట టికెట్టు ఇస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఈ విషయాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు తెలియజేసి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్నానని సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన సృష్టిస్తూ అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. జగన్‌ను ఓడించకపోతే రాష్ట్రం అధోగతిపాలవుతుందన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును స్పష్టంగా తెలియజేయనున్నారన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమ పాలనకు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే అంశంలో చిత్తశుద్ధితో కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.



డాక్టర్ జి.ఎన్.నాయుడును సత్కరిస్తున్న టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పుల్లంపేట, ఫిబ్రవరి17 : సర్వజన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పుల్లంపేట మండలంలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని అనంతసముద్రం పంచాయతీ బోటు మీద పల్లెకు చెందిన సోమా జనార్దన్ యాదవ్ 14వ వర్ధంతి సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు కావాల్సిన సామగ్రిని సమితి సభ్యులు అందజేశారు. మండలంలో 10వ తరగతిలో టాపర్స్‌గా నిలిచిన ఇరువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు, హెచ్ఎం రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

నేషనల్ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 17: మార్చి నెల 9వ తేదీన రాయ చోటి కోర్టులో జరగనున్న నేషనల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి పిలుపు నిచ్చారు. శనివారం ఆయన రాయచోటి కోర్టులో మార్చి 9న జరగనున్న నేషనల్ లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఎంఈవోపీ, మోటారు యాక్సిడెంట్ కేసులు, క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఫాతిమా, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కే. శారద, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహబూబ్‌బాషా, న్యాయవాదులు నాగి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, టీ. ఈశ్వర్, పగడాల శ్రీనివాసులు, రమేశ్‌రెడ్డి, నాగముని తదిత రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి

జిడ్డు కృష్ణమూర్తికి నివాళి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 17: భారతీయ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా శనివారం జేవీవీ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిడ్డు కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలి



ప్రచారం చేస్తున్న నగరిపాటి రేవతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 17: చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కొండంపల్లె, గోవిందంపల్లె తదితర గ్రామాల్లో శనివారం నియోజక వర్గ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాల్లో ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అన్యాయాలకు ప్రజలు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా టీడీపీకి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. వచ్చే టీడీపీ ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగిరిపాటి మహేష్, నగిరిపాటి సుబ్రహ్మణ్యం, రాజంపేట పార్లమెంట్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు తేనేపల్లి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 17: పీఆర్‌సీలో మధ్యంతర భృతి 30 శాతం వెంటనే చెల్లించాలని ఎన్జీవో సంఘం అధ్యక్షుడు పొలిచర్ల ఓబులేశు డిమాండ్ చేశారు. శనివారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలు తక్షణమే విడుదల చేయాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల బకాయిలు, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెన్షన్ ఇవ్వాలని, అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఈహెచ్ఎస్ కార్డ్స్ ద్వారా నగదు రహిత వైద్యం అందించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. టీచర్లకు అప్రెంటిస్ విధానంతోపాటు, జీవో 117ను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీ వేజెస్, పార్ట్‌టైం, ఫుల్‌టైం ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వం, పంచాయతీరాజ్ టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్సు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి షేక్ మహ్మద్‌అస్లాం, ఉపాధ్యక్షుడు కే. సంతోష్‌రెడ్డి, గౌరీశంకర్, కార్యదర్శి విజయ్‌వర్మ, అసోషియేట్ ప్రెసిడెంట్ జే. రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఆదివారం సెలవు ఇవ్వాలి



డీఎస్‌వోకు వినతిపత్రం ఇస్తున్న సాంబశివ

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి17: అన్నమయ్య జిల్లాలోని సివిల్ సప్లై గోదాముల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న హమాలీలకు ఆదివారం సెలవు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శనివారం సివిల్ సప్లై హమాలీలతో కలిసి జిల్లా పౌరసరఫరాల మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ పెరుగు తున్న ధరలను దృష్టిలో ఉంచుకుని కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని 12 సివిల్ సప్లై గోదాముల్లో హమాలీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని కోరారు. హమాలీలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన అన్నారు. గోదాముల్లో ఎలుకల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి సలీంబాషా, రాంప్రసాద్, వెంకటనరసింహులు, సంపత్ కుమార్, చిన్నప్ప, ఆంజనేయులు, శంకర, శ్రీనివాసులు, దేవా తదితరులు పాల్గొన్నారు.

మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా సూర్యనారాయణ



సన్మానం అందుకుంటున్న సూర్యనారాయణ

నందలూరు, ఫిబ్రవరి 17: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ సర్పంచ్ చాంబర్‌లో ఈ ఎంపిక నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్య వచ్చినా కలిసికట్టుగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు షైనుద్దీన్, శిరీష, నరసింహారెడ్డి, అక్కిరెడ్డి స్వరూప, వెంకట నరసయ్య, లక్ష్మీదేవి, నందలూరు చైతన్య భారతి, మోడపోతుల సుభాషిణి, చుక్క నిర్మల, మేడా రాజశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, నాయకులు గీతాల నరసింహారెడ్డి, మోహన్ రెడ్డి, మోడపోతుల రాము, నందలూరు భాస్కర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జంబు సూర్యనారాయణ ఘనంగా సత్కరించారు.

మండల సర్వేయర్‌ను అరెస్టు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు, కమ్యూనిస్టు నాయకులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 17: అవకతవకలకు పాల్పడుతున్న మండల సర్వేయర్ భవానిని అరెస్టు చేయాలని కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని ఫిబ్రవరి 12న కలెక్టర్ కార్యాలయం దగ్గర ఆందోళన చేసి జేసీకి వినతిపత్రం ఇవ్వడంతో ఆయన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వరప్రసాద్, రాజంపేట డివిజన్ అధికారి బాలాజీకి విచారణకు ఆదేశించారు. దీంతో శనివారం మండలంలోని వై.కోట సచివాలయానికి వచ్చిన జిల్లా అధికారి వరప్రసాద్ భూములను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మండల సర్వేయర్ భవానిపై తగిన చర్యలు తీసుకోకపోతే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, సీపీఎం జిల్లా నాయకులు ఎం.జయరామయ్య, సీపీఐ మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ, కేవీపీఎస్ నాయకులు, గ్రామస్తులు హాజరయ్యారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం



రాజంపేట డిగ్రీ కళాశాలలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాజంపేట, ఫిబ్రవరి17 : రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యూనిట్-1 ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం శ్రమదానం చేశారు. రెండు రోజులుగా డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో ముళ్ల పొదలు, రాళ్లను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానాలు..



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్వీ రమణ

రాజంపేట టౌన్, ఫిబ్రవరి17 : విద్యతోనే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చునని గీతాంజలి కళాశాల ఛైర్మన్ ఎస్.వి.రమణ శనివారం సూచించారు. కళాశాలలో ఫేర్వెల్ వేడుక సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజే శారు. ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య నాయుడు, మాజీ ఏజీపీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, విశ్రాంత సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.రామాంజనేయులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆత్మీయ సమావేశాలకు తరలిరండి

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 17 ఈ నెల 19న సోమవారం సాయంత్రం 3 గంటలకు లక్కిరెడ్డిపల్లెలోని ఆర్ ఆర్ ఇంట్లో నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశానికి టీడీపీ కార్యకర్తలు. నాయకులు తప్పకుండా హాజరు కావాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.

రామాపురం: మండల పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఆర్‌ఆర్ బంధువులు, ఆత్మీయులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.


నిప్పులు చిమ్ముతూ నింగిలోకి


రాకెట్ మొదటి దశ


రెండవ దశ


మూడవ దశ


రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

షార్ సత్తా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ మరోమారు సత్తాచాటింది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి దేశ ప్రతిష్ఠను పెంచింది.వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం పంపిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని శనివారం సాయంత్రం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.18.46 నిమిషాల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ మూడు దశలను పూర్తి చేసుకొని ఉపగ్రహాన్ని విజయవంతంగా రోదసిలోకి చేర్చడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి.ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 వేలమందికి పైగా విచ్చేశారు. వీరిలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరందరూ ఉదయం నుంచే షార్ సమీపంలో ఉన్న సందర్శకుల గ్యాలరీకి చేరుకొన్నారు.రాకెట్ నింగికెగిరిన సమయంలో ప్రేక్షకుల కరతాళధ్వనులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.షార్ నుంచి ఇప్పటి వరకు 91 ప్రయోగాలు చేపట్టారు. తాజా ప్రయోగం 92వది కాగా జీఎస్ఎల్వీ-మార్క్ 2 ప్రయోగాల్లో 16వ ప్రయోగం కావడం విశేషం.కాగా ఈ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి శనివారం ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ పూజలు చేశారు.అలాగే తిరుమల ఆలయంలో, శ్రీకాళహస్తీశ్వరాలయంలో జీఎస్ఎల్వీ- ఎఫ్14 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ ఉన్నారు.

థర్డ్ జనరేషన్ శాటిలైట్

ఇన్‌శాట్-3డీఎస్ మూడవ తరం వాతావరణ ఉపగ్రహానికి తదుపరి మిషన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఉపగ్రహంలో వాతావరణ పరిస్థితిని అంచనా వేయగల అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ ఉపగ్రహం ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల సేవలకు కొనసాగింపుగా వాతావరణ సేవలను మెరుగుపరచనుంది.


జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 77,483 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,276 మంది తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

● పదిరోజుల్లో పూర్తిగా కోలుకున్న బాధితుడు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థికి అత్యంత సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆయన శనివారం మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్‌కుమార్ ద్వివేది స్థానిక వేదిక్ యూనివర్సిటీలో ఎంఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 6న యూనివర్సిటీ ఆవరణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని తలభాగంలోని నుదుటి ఎముకలు దెబ్బతిని, మెదడులోకి చొచ్చుకుపోయాయి. దవడ ఎముకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్విమ్స్‌కు తీసుకురావడంతో న్యూరో, ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు 4గంటలపాటు శ్రమించి అతిక్లిష్టమైన సర్జరీని అధునాతన పరిజ్ఞానంతో విజయవంతంగా పూర్తిచేశారని వివరించారు. ముఖ భాగానికి మునుపటి రూపం తీసుకురావడమేగాక పది రోజుల్లోనే కోలుకునేలా చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. టీటీడీ ప్రాణదాన పథకం ద్వారా సర్జరీని పూర్తి ఉచితంగా చేయగలిగామని తెలిపారు. సచిన్ కుమార్ ద్వివేది మాట్లాడుతూ తన ప్రాణం నిలబెట్టిన స్విమ్స్, టీటీడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, ఎంఎస్ డాక్టర్ రామ్, న్యూరోసర్జరీ, అనస్థీషియా విభాగాధిపతులు డాక్టర్ రమేష్ చంద్రా, డాక్టర్ అలోక్ సమంత్రే, డాక్టర్లు బీసీఎం ప్రసాద్, వెంకట్, చంద్రశేఖర్, ప్రవీణ్ కుమార్, నాగతేజ, డీడీలు ప్రభావతి, రాజశేఖర్ పాల్గొన్నారు.


విద్యార్థితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

మద్యం పేరుతో తనిఖీలకొచ్చి..

దుస్తులను ఎత్తుకెళతారా?

పోలీసులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ శ్రేణులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 17: 'మద్యం అక్రమంగా తీసుకొచ్చి స్టాక్ పెట్టినట్లు ఫిర్యాదు అందిందని తనిఖీలకొచ్చి.. పేదల కోసం తెచ్చిన దుస్తులను ఎత్తుకెళతారా?' అంటూ పోలీసులతో టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగాయి. స్థానికులు, టీడీపీ శ్రేణులు తెలిపిన వివరాల మేరకు.. జీడీనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ గంగాధరనెల్లూరు మండలం వెజ్జుపల్లె పంచాయతీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీతోపాటు మన ఇంటికి మనడాక్టర్ థామస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించాలని నిర్ణయించారు. ఆయన సొంత నిధులతో పేదల కోసం సంక్రాంతి కానుకగా దుస్తులను పంపిణీ చేయాలని శుక్రవారం రాత్రి స్టాక్ తెచ్చారు. ఈ క్రమంలో శనివారం ఉదయం సుమారు ఏడు గంటల ప్రాంతంలోనే వెజ్జుపల్లెకు పోలీసులు చేరుకున్నారు. టీడీపీకి చెందిన కొందరి ఇళ్లకు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప, కానిస్టేబుల్ ప్రభు వెళ్లారు. మద్యం స్టాక్ అక్రమంగా తెచ్చి మీ ఇళ్లలో పెట్టారని ఫిర్యాదు అందిందంటూ.. ఇళ్లలోపల చూపించాలని బెదిరిస్తూ తనిఖీలు చేశారు. అలాగే మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి కోళ్లఫారం వద్దకెళ్లారు. అక్కడున్న ఓ గదిలో మద్యం ఉందంటూ తనిఖీ చేయగా సంక్రాంతి కానుక దుస్తుల బాక్సులు కనిపించడంతో వాటిని అప్పగించాలని పట్టుబడ్డారు. దుస్తుల బాక్సులను ఇచ్చేది లేదని.. కేసుపెట్టి ఉంటే ఎఫ్ఐఆర్ కాపీని చూపించాలని మాజీ ఎంపీటీసీ, ఆయన కుమారుడు దయారెడ్డితోపాటు టీడీపీకి చెందిన నేతలు, కార్యకర్తలు సుమారు మూడు గంటలపాటు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినా దుస్తుల బాక్సులను పోలీస్ వాహనంలోకి ఎక్కించుకుని గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై సీఐ శంకర్‌ని ఫోన్‌ద్వారా వివరణకోరగా.. వెజ్జుపల్లెలో సంక్రాంతి కానుకపేరుతో దుస్తులు పంచుతున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్లను ప్రలోభపెట్టడానికి బహుమతులు ఏవీ ఇవ్వరాదని చెప్పారు. అలాగైతే వైసీపీ నేతలు పలుచోట్ల రకరకాలుగా బహుమతులు ఇస్తున్నారు కదా వాటినినీ అలాగే స్వాధీనం చేసుకున్నారా? అని అడిగితే ఆ విధంగా వైసీపీవారు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సీజ్ చేస్తామని సీఐ వివరించారు. ఇదిలా ఉంటే.. మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొని, దుస్తుల బాక్సులను కోర్టుకు అప్పగించనున్నట్లు పోలీసుల ద్వారా సమాచారం అందింది. కాగా.. ఈ అంశంపై తమ పార్టీ నేతలను పోలీసులు ఇబ్బంది పెట్టారంటూ టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ మాట్లాడిన వీడియో ఒకటి వాట్సాప్‌ల్లో వైరల్ అవుతోంది.




కోళ్లఫారం వద్ద పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం - దుస్తుల బాక్సును ఎత్తుకెళుతున్న హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప

ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్ల బాధ్యత కీలకం : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్ల బాధ్యతే కీలకమని జేసీ శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నోడల్ ఆఫీసర్లు, వారి సహాయక సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సోమవారం నుంచి ఎన్నికల నిర్వహణపై వరుసగా సమావేశాలు జరుగుతాయని చెప్పారు. వీటికి గైర్హాజరయ్యే అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం కార్యాలయ పనులు, మధ్యాహ్నం ఎన్నికల పనులు చేయాలన్నారు. అంతకుముందుకు తన క్యాంపు కార్యాలయం నుంచి పోలింగ్ కేంద్రాల పరిశీలన, ఎన్నికల విధులు, రేషన్ పంపిణీ, రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, బీఎల్వోలు, పంచాయతీ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో పుల్లయ్య, డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఫిట్‌మెంట్ 30 శాతం మంజూరు చేయాలి



ఎన్జీవో భవనం వద్ద నినాదాలు చేస్తున్న జేఏసీ నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించడంతో పాటు 30శాతం ఫిట్‌మెంట్‌ను మంజూరు చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్ కేవీ రాఘవులు డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలో భాగంగా శనివారం ఎన్జీవో భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించిన సరెండరు లీవు, జీపీఎస్, ఏపీజీఎల్ఐ లోన్లు, డీఏ బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలన్నారు. ఐఆర్‌కు సంబంధించిన పేరివిజన్ కమిషన్ ఇప్పటి వరకు ఎలాంటి బాధ్యత తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోమశేఖర్ నాయుడు, చెంగల్రాయమండడి, నాదముని, వీజీ రఘు, మహేష్, లక్ష్మీనారాయణ, పన్నీర్ సెల్వం, సుబ్రహ్మణ్యం, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కాగా, శనివారం జిల్లాలోని 14 పాత తాలూకా కేంద్రాల్లో ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ర్యాలీ, ధర్నా కార్యక్రమాలను నిర్వహించి తహసీల్దార్లకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో 56 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శనివారం ఉదయం 6 గంటలకు ప్రధాన కల్యాణకట్ట ముందున్న షెడ్‌లో 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి కదలిక లేకుండా ఉండటాన్ని విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద లభించిన ఓ బ్యాగులో గత నెల 3వ తేదీన వేలూరులోని ప్రభుత్వాస్పత్రిలో తీసుకున్న ఎక్స్‌రే లభించింది. అందులో శరవణన్ (56) అని మాత్రమే ఉంది. ఇతర గుర్తింపు కార్డులు, బంధువులు ఎవరు లేకపోవడంతో తిరుమల వన్‌టౌన్ పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 0877-2263654, 94407 96771లకు తెలియజేయాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఒకరి అరెస్టు, మరొకరు పరారీ

చిత్తూరు, ఫిబ్రవరి 17: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొచ్చిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.2.20 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం, ఓ స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. వివరాలను రెండో పట్టణ సీఐ ఉలసయ్యతో కలిసి చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి శనివారం మీడియాకు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి మద్యంతోపాటు నిషేధిత వస్తువులు రాకుండా నిఘా పెట్టారు. శనివారం పోలీసులకు వచ్చిన సమాచారంతో తేనెబండ రాజీవ్‌నగర్‌కాలనీకి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద టెలిఫోన్‌కాలనీకి చెందిన రాజా(36)ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.2.20 లక్షల విలువ చేసే మద్యం, సరఫరాకు ఉపయోగించిన మోటరు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రానున్న ఎన్నికల నిమిత్తం కర్ణాటక నుంచి తేనెబండకు చెందిన జ్యోతితో కలిసి ఈ మద్యాన్ని తీసుకొచ్చి స్టాకు పెట్టుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వాంగ్మూలాన్ని నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. జ్యోతి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న పోలీసులను ఆయన అభినందించారు.


పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

యాత్రకు రండి...ప్లీజ్!

'రండి బాబూ రండి, రండి తల్లీ రండి...మీ కోసం లగ్జరీ బస్సు పెట్టాం. ఇంటర్వెల్లో స్నాక్స్ కూడా ఇస్తాం. బిందాస్‌గా వచ్చి సినిమా చూసి వెళ్లండి' అంటూ చంద్రగిరి నియోజక వర్గ ప్రజల వెంట పడుతున్నారు వైసీపీ నాయకులు. జగన్ ప్రచారం కోసం తీసి విడుదల చేసిన యాత్ర-2 సినిమా థియేటర్లు వెలవెలపోతుండడంతో వాటిని నింపడానికి నానా అవస్థలూ పడుతున్నారు. శనివారం నుంచి చంద్రగిరిలో యాత్ర-2 సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు జనాన్ని తరలించే ఏర్పాట్లు ఘనంగానే మొదలు పెట్టారు. ప్రత్యేక షోలు ఏర్పాటు చేశారు. పంచాయతీకి రెండు బస్సులు చొప్పున సిద్ధం చేశారు. ఎమ్మెల్యే ఏపీఅర్వోల ద్వారా ఈ సమాచారాన్ని పంచాయతీల పరిధిలోని సచివాలయాలకు చేర్చారు. వలంటీర్ల ద్వారా ప్రేక్షకులను రాబట్టే ప్రయత్నం చేశారు. పెద్ద పంచాయతీలకు ప్రత్యేక లగ్జరీ బస్సులను పంపారు. చిన్న పంచాయతీలకు మినీ బస్సులను పంపారు. బస్సులను థియేటర్ వద్ద నిలిపి అందులోని వారిని దగ్గరుండి హాలు లోపలకు సాగనంపారు.ఇంటర్వెల్ సమయంలో సమోసా, కూల్ డ్రింక్స్ అందించారు.చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలూ కవరయ్యేలా ప్లాన్ చేశారు. మరో మూడు రోజుల పాటు యాత్ర-2 సినిమాను ఆడేలా చేయాలన్న సంకల్పంతో వైసీపీ నేతలున్నారు. ఇందులో భాగంగా శనివారం మార్నింగ్ షో చూపించాలని తొలుత భావించారు. కానీ అనుకున్నంత స్పందన లేకపోవడంతో వారిని మ్యాట్నీకి మార్చారు. తొలిరోజే స్పందన లేకపోతే మిగిలిన రోజులు ఎట్లస్వామీ అని కార్యకర్తలు, వలంటీర్లు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


చంద్రగిరిలో సినిమా హాలు వద్దకు బస్సుల్లో తరలిస్తున్న జనం

కళ్లకు గంతలతో జూనియర్ డాక్టర్ల నిరసన

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17 : ఐదు నెలలుగా రావాల్సిన స్టైఫండ్ చెల్లించాలని కోరుతూ రుయాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. నిత్యం వైద్యుల సేవలో ఉండే తాము స్టైఫండ్‌పైనే ఆధారపడి చదువుకుంటున్నామని, అలాంటిది ఐదు నెలలుగా రాకపోవడంతో ఖర్చులకు సైతం తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ విషయమై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు సోమవారం లోపు వారికి స్టైఫండ్ చెల్లించాలని డీఎంఈను ఆదేశించారు. దీంతో జూడాలు ఆందోళన విరమించారు.



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిదిమందికి గాయాలు

● ముగ్గురి పరిస్థితి విషమం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: కురబలకోట, గుర్రంకొండ, తంబళ్లపల్లె మండలాల్లో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిదిమందికి గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. వాల్మీకిపురం మండలం గొల్లపల్లెకు చెందిన గురునాథ్(29), యాదమరి మండలం తిరుమలపల్లెకు చెందిన ఉదయ్(21) మదనపల్లెలోని ఓ హాచరీ(కోళ్లఫారం)లో పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి తంబళ్లపల్లెకు ఒక టెంపోలో కోళ్లను పంపించి, వారిద్దరు ద్విచక్రవాహనంలో తంబళ్లపల్లె చేరుకున్నారు. శనివారం ఉదయం తిరిగి మదనపల్లెకు వస్తుండగా ముదివేడు వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న గోడను ఢీకొనడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా మారంది. అలాగే తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన వెంకటరమణ(50), అతని భార్య పద్మావతి(45) ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలో అడవిపందుల గుంపు రోడ్డుకు అడ్డంగా రావడంతో అదుపు తప్పి కింద పడడంతో వెంకటరమణ తలకు తీవ్రగాయమైంది. అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఇక్కడి వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అలాగే తంబళ్లపల్లె మండలం దేవబురుజుకు చెందిన జి.నాగరాజు(58), సుబ్బమ(60), కుమారి(45), మిట్టావాండ్లపల్లెకు చెందిన లక్ష్మిదేవి (61), శివమ్మ కలసి ఆటో బాడుగకు మాట్లాడుకుని గుర్రకొండ మండలం కదిరాయచెరువు వద్ద ఓ రైతు పొలంలో కూలి పనులకు వెళుతుండగా మార్గమధ్యంలో స్పీడ్ బ్రేకర్ గమనించని ఆటో డ్రైవర్ వేగంగా ఆటో నడపడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన ఐదుగురిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: భర్తతో గొడవ పడి ఆత్మహత్యాయత్నం చేసుకున్న యువతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మదనపల్లె మండలం కొత్తిండ్లు పంచాయతీ రంగా రెడ్డికాలనికి చెందిన చైతన్య భార్య శశికళ(28) ఇటీవల తెలిసిన వారికి డబ్బులు అప్పుగా ఇచ్చింది. ఈ విషయం తెలిసి ఆమె భర్త చైతన్య మందలించడంతో ఈనెల 15వ తేది శశికళ మనస్థాపంతో ఎలుకలమందు తినేసింది. గమనించిన కుటుంబీకులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, రెండు రోజుల పాటు చికిత్స పొందితూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో పెళ్లితో టోకరా.. నగదు, బంగారుతో ఉడాయించిన భార్య

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 17:రెండో పెళ్లితో ఓ వ్యక్తిని మోసం చేసి అతని వద్ద ఉన్న బంగారు నగదుతో వుడాయించిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిమ్మనపల్లి మండలం పెద్దమాదిగపల్లికి చెందిన కె.వెంకటరమణ భార్య మాతమ్మ 10 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించడంతో ఇతని మంచి చెడూ చూసుకొనేందుకు అతని బంధువులు సుండుపల్లిలో మేస్త్రీ కూలీగా పనిచేసుకొంటున్న శాంతిని 4ఏళ్ల క్రితం వెంకటరమణకు ఇచ్చి వివాహం చేశారు. అయితే ఏడాది క్రితం వెంకటరమణ తన ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుంగా జారి పడి వెన్నుముక విరిగింది. అప్పటి నుంచి ఇంటి వద్దనే వుంటూ వ్యసాయం చేసుకొంటూ ఉన్నారు. కాగా గతేడాది నవం బరులో శాంతి తన తల్లి మునెమ్మతో కలసి ఎవ్వరికీ చెప్పకుండా ఇంటిలో నుంచి 10గ్రాముల బంగారు, రూ.20వేలు నగదు. 150గ్రాముల వెండి ఎత్తుకొని వెళ్లిపోయిందని బాధితుడు వెంకటరమణ వాపోయాడు. ఆమేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు నెలలు కావస్తున్న తనకు న్యాయం జరుగలేదని శనివారం స్థానిక విలేకర్ల ఎదుట తన ఆవేదనను వ్యక్తం చేశారు. తనది తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి అని అప్పటికే భార్య శాంతికి పెళ్లి అయి భర్తను వదిలేసి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లు వున్నట్లు తెలిసింది. కాగా వెంకటరమణ కేసు విషయమై నిమ్మనపల్లె హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తిని వివరణ కోరగా సంఘటనపై తమకు ఫిర్యాదు అందిందని అయితే బాధితుడు వచ్చి తమను సంప్రదిస్తే వారిని పిలిపించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 17 : కర్ణాటక రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాలకు అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చేలూరు నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న అనంతపురం జిల్లా తనకల్లు మండలం రతిన నాయక్ తండాకు చెందిన పాలిత్య సురేష్ నాయక్ అనే వ్యక్తి ని అరెస్టు చేసి 960 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిని మదనపల్లె మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా నిందితుడికి మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో ఎక్కడైనా కర్ణాటక మద్యాన్ని గానీ, నాటు సారా అమ్ముతున్నట్లైతే ప్రజలు 9440902534 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.


ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం



మంటలార్పుతున్న బాధిత రైతులు

రామసముద్రం, ఫిబ్రవరి 17: రామసముద్రంలోని దిగువపేట సమీప పొలాలలో ఉన్న మూడు గడ్డి వాములు శనివారం అగ్నికి ఆహుతయ్యాయి. పొలాల గట్టులో ఏపుగా పెరిగిన జమ్మూ గడ్డి ఎండి పోగా గుర్తుతెలియని వ్యక్తులు వాటికి నిప్పుపెట్టారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో పొలాలలో ఉన్న దిగు వపాళ్యం కృష్ణప్పకు చెందిన గడ్డి వామి, టెంకాయ చెట్టు, టమో టా పంటకు ఉపయోగించే వెయ్యి కట్టెలు, దిగువపేట వెంక టప్పకు చెందిన గడ్డి వామికి మంటలు అంటుకున్నాయి. వెంట నే పొలాలలో రైతులు మంటలు ఆర్పడానికి ఎంత ప్రయ త్నం చేసినా మంటలు ఆరకపోవడంతో గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. పుంగనూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి వారు వచ్చేలోపే గడ్డి వాములు పూర్తిగా కాలిపో యాయి. వాటి విలువ సుమారుగా రూ.80వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. వేసవిలో పశువుల మేతకు కోసం ఉంచిన గడ్డి కాలిపోవడంతో పశు పోషణ ఎలా చేయాలని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబరుగా వేణుగోపాల్



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17: మదనపల్లె (సీటీఎం) రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడుగా ఎం.వేణుగోపాల్‌ను సౌత్‌సెంట్రల్ రైల్వేవారు నియమించారు. ఇందుకు సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌కు, రాజంపేట పార్లమెంటరి జిల్లాప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్‌కు ఈ సందర్భంగా వేణుగోపాల్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె రోడ్డు రైల్వేస్టేషన్ అభివృద్ధికి తన వంతుకృషి చేస్తామని పేర్కొన్నారు.

సీఎం సభకు బస్సులు.. ప్రయాణికుల పాట్లు



బస్సులు రాకపోవడంతో బోసిపోయిన బి.కొత్తకోట బస్టాండు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: మదనపల్లె ఆర్టీసీ రెండు డిపోలకు చెందిన 75శాతం ఆర్టీసీ బస్సులన్నీ సీఎం సభకు జనాలు తర లించేందుకు వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మదనపల్లె వన్ డిపోలో 117 ఆర్టీసీ బస్సులు ఉండగా 76 బస్సులను, టు డిపో పరిధిలో 83 బస్సులు వుండగా వాటిలో 57 బస్సులను ఆర్టీసీ అధికారులు ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరుగనున్న సీఎం సభకు మళ్లించారు. దీంతో విషయం తెలియక మదనపల్లెకు వచ్చిన విద్యార్థులు, చుట్టుపక్కల ప్రజలు ఆర్టీసీ బస్టాండు వద్ద పడిగాపులు కాస్తున్నారు. కొందరైతే ఆటోలు, టెంపోలు అద్దెకు మాట్లాడుకుని సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు.

రాప్తాడు సభకు తరలిన ఆర్టీసీ బస్సులు

బి.కొత్తకోట,ఫిబ్రవరి17: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం వైసీపీ నిర్వహిస్తున్న సిద్ధం సభకు, బి.కొత్తకోట నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులను తరలించడంతో ఆ మార్గాలలో వెళ్లాల్సిన ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర అవస్తలు పడ్డారు. బి కొత్తకోట-ఉప్పరోళ్లపల్లి, బి కొత్తకోట-ములకలచెరువు, బి కొత్తకోట-టి సదుం తదితర సర్వీసులను రద్దుచేసి రాప్తాడుకు పంపారు. దీంతో మద్దయ్యగారిపల్లి, పీటీయం, బూర్లపల్లి, తుమ్మరకుంట, టి సదుం, కాట్నగల్లు, మల్లెల ములకలచెరువు, పులికల్లు తదితర గ్రామాలకు వెళ్లాల్సిన వారు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. సమాచారం తెలియని విద్యార్థులు బస్సుల కోసం కాపుకాసి విసిగిపోయారు. దారిన పోయే వాళ్లదగ్గర ఫోన్ తీసుకొని ఇళ్లకు సమాచారం ఇచ్చి, ద్విచక్రవాహనాలలో, ఆటోలలో వెళ్లడం కనిపించింది. మదనపల్లె-1 డిపో నుంచి ప్రతిరోజూ బస్సులు బి కొత్తకోట చేరుకుని చుట్టుపక్కల మండలాలకు, మదనపల్లెకు ప్రజారవాణా చేస్తుంటాయి. అసలే అరాకొరా బస్సులు, ఉన్న సర్వీసులు కూడా రద్దు చేయడం తెలుసుకున్న ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పీలేరు డిపోలోని 85 బస్సుల్లో 62 కేటాయింపు

పీలేరు, ఫిబ్రవరి 17: పీలేరు డిపోలోని అధిక శాతం బస్సులు అనంతపురంలో ఆదివారం జరగనున్న అధికార పార్టీ 'సిద్ధం' సభకు వెళ్లిపోవడంతో శనివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీలేరు డిపోలో 85 బస్సులు ఉండగా వాటిలో 62 బస్సులు సభ కోసం కేటాయించడంతో శనివారం ఉదయం 11 గంటల నుంచి అవి వెళ్లిపోయాయి. ఆ సంగతి తెలియని ప్రయాణికులు ఎప్పటిలాగా తమ ప్రయాణాల కోసం పీలేరు బస్టాండుకు చేరుకుని బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించారు. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో చాలా మంది తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రైవేటు వామనాలను సైతం అధికార పార్టీ నాయకులు బుక్ చేసుకుని ఉండడంతో అవి కూడా అందుబాటులో లేకుండాపోయాయి. విద్యాసంస్థలకు చెందిన బస్సులను కూడా సభకు కేటాయించాలని రవాణా శాఖ అధికారులు ఆయా యాజమాన్యాలకు హుకుం జారీ చేసి ఉండడంతో శనివారం అధిక శాతం పాఠశాలలు పాక్షికంగా సెలవు ప్రకటించాయి. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులను తల్లిదండ్రులే పాఠశాలల వద్ద దింపాలని సెల్‌ఫోన్‌లకు సందేశాలకు పంపారు. విద్యార్థులు, ప్రజల అవసరాల కంటే అధికార పార్టీ సమావేశాలే ముఖ్యమయ్యాయంటూ పలువురు అసహనం వ్యక్తం చేశారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం ఎంపిక

మదనపల్లె అర్బన్ ఫిబ్రవరి 17: భారతీయ జనతా పార్టీ మదనపల్లె పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ మదనపల్లె పట్టణఅధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్ శనివారం ప్రకటించారు. ఇందులో మొత్తం 24 మంది నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శులుగా కోసూరి భవాని, కొత్తకోట మహేష్, ఉపాధ్యక్షుడుగా కొండయ్య, తదితరులతో పూర్తి స్థాయి కమిటీని ప్రకటించారు. యువమోర్చా అధ్యక్షుడుగా సంతోష్, మహిళ మోర్చా అధ్యక్షురాలుగా మీనాక్షి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా గణపతి, ఎసీటమోర్చా అధ్యక్షుడుగా సురేంద్రనాయక్, మైనార్టీ అధ్యక్షుడుగా రఫీలను బీజేపీ రాజంపేట ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్, కృష్ణమూర్తి, పూలనాగరాజు, బాలసుబ్రహ్మణ్యంయాదవ్, కృష్ణయ్యవర్మ, యూత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారులదే ఎన్నికల బాధ్యత



గుర్రంకొండలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

పీలేరు, ఫిబ్రవరి 17: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత సెక్టోరల్ అధికారులు, పోలీసు సెక్టోరల్ అధికారులదేనని జేసీ ఫర్మాన్ అహ్మద్ పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలోని సెక్టోరల్ అధికారులు, పోలీసు సెక్టోరల్ అధికారులకు వారి విధులు, బాధ్యతలు, ఈవీఎంల వాడకంపై జేసీ శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు, పోలీసు సెక్టోరల్ అధికారులు తమ కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిశీలన దగ్గర నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూములో భద్రపరిచే కీలక బాధ్యతలు వారిపై ఉన్నాయన్నారు. నార్మల్, క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిని మ్యాపింగ్ చేసి పోలీసు సెక్టోరల్ అధికారులతో కలిసి ముందుగానే ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీలేరు నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 93 వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటన్నింటిలోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆయన ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూముగా ఎంపిక చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి కళాశాలలోని గదులను పరిశీలించి స్ట్రాంగ్ రూము ఏర్పాటుకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు వాటిని తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, ఈఆర్వో రమా, ఏఈఆర్వోలు మహబూబ్ బాషా, నయాజ్ అహ్మద్, ప్రియదర్శిని, విజయకుమారి, శ్రీనాథ్, ఖతీజున్ ఖుబ్రా, సీఐ మోహన్ రెడ్డి, ఏడీఏలు వాణిశ్రీ, రమణరావు, ఈడీటీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి : జేసీ

గుర్రంకొండ, ఫిబ్రవరి 17:ఎన్నికలు జరిగే ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓటర్లకు అన్ని వసతులను కల్పించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గుర్రంకొండ హైస్కూల్‌లో శనివారం పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించి వసతులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వెలుతురు, ర్యాంప్, భద్రత, కేంద్రాలను చుట్టూ ప్రహరీ, ఇతర వసతులను పరిశీలించారు. ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోనేలా ఏర్పాటు చేయాలని రెవెన్యూ, సెక్టోరియల్ అధికారులకు సూచించారు. ఎన్నికల నాటికి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనాథ్, ఎంఈవో సురేంద్రబాబు, అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లెలో జోస్ ఆలుక్కాస్ జ్యువెలరీ షోరూం ప్రారంభం



మదనపల్లెలో ప్రారంభమైన జోస్ ఆలుక్కాస్ జ్యువెలరీ షోరూం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17: మదనపల్లెలోని సీటీఎం రోడ్డులో సరికొత్త ఆభరణాల జోస్‌ఆలుక్కాస్ షోరూమ్ ప్రారంభమైంది. శనివారం ఈ షోరూంను సెలబ్రిటీ సినీనటి పాయల్‌రాజ్‌పుత్ ప్రారంభించగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజా, మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా,జాన్ ఆలుక్కా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె పరిసర ప్రాంత మహిళలకు, వినియోగదారులకు సరికొత్త డిజైన్లలో ఆధునాతన సౌకర్యాలతో మదనపల్లెలో షోరూం ప్రారంభించామని తెలిపారు. ప్రారంభోత్సవ సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు మా షోరూమ్‌లో ఇస్తున్నట్లు తెలిపారు. కనిష్టంగా రూ. 50 వేలు విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలుపై ఒక ప్రోత్సాహక బంగారు నాణేన్ని వినియోగదారులకు అందిస్తున్నామని ఈ ఆఫర్ ఫిబ్రవరి 21వరకు అందుబాటులో ఉంటుందన్నారు. వజ్రాలపై ఘననీయంగా 20శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపు వినియోగదారులు పొందవచ్చన్నారు. మదనపల్లెలో ఆకర్షణీయమైన, బంగారు, వజ్రాలు, ప్లాటినం కలెక్షన్ల సమ్మేళనంతో కొలువు తీరిందని చైర్మన్ తెలిపారు.

అట్టడుగు వర్గాలకు సాధికారత కల్పించాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 17: అట్టడుగు వర్గాలకు సామాజిక, సాధికారత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పంచప్రాణ్ కార్యక్రమంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు మల్లికార్జున, రాఘవేంద్ర, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి పాల్గొన్నారు.

పాడిరైతుల సమస్యలను పరిష్కరించండి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17: పాడిరైతుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్‌పార్టీ రాజంపేట పార్లమెంట్ నాయకుడు, పుంగనూరు కన్వీనర్ సింగంరామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మదనపల్లె మండలంలో ఇంటింటా కాంగ్రెస్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా కొండామరిపల్లె, గారబురుజు, రామాచార్లపల్లె పర్యటించి పాడి రైతులతో ఆయన మాటాడారు. పాడి ఆవులకు పశుగ్రాసం, దాణా పోషకాలు ప్రభుత్వం అందించాలన్నారు.

డ్రైవర్ దూకుడు నిర్ణయం.. ట్రాఫిక్‌కు అంతరాయం

పీలేరు, ఫిబ్రవరి 17: బాధ్యతగా వ్యవహరించాల్సిన ఓ ఆటోడ్రైవర్ అనాలోచిత నిర్ణయం కారణంగా శనివారం పీలేరు పట్టణం నెహ్రూబజారు వీధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లగేజీ ఆటోలో ఇనుప గేట్లు తీసుకెళుతున్న డ్రైవరు, తన ఆటోలో ఉన్న గేట్ల ఎత్తును అంచనా వేయలేకపోవడంతో అవి రైల్వే బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన క్రాసింగ్‌కు తగులుకోవడంతో ఆటో ఒక్కసారిగా పైకి లేచిపోయింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులు దూకేశారు. ఆటోలోని ఇనుప గేట్లు రైల్వే క్రాసింగ్‌కు తగులుకోవడంతో వాటిని విడదీయడానికి గంటపాటు శ్రమించాల్సి వచ్చింది. అంతసేపు ఆ దారిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

అశ్వవాహనంపై వెంకన్న చిద్విలాసం



తంబళ్లపల్లె, ఫిబ్రవరి 17: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దేవదేవుడు అశ్వవాహనంపై భక్తులను కనువిందుచేశారు. సేవ నిర్వహించారు. గత తొమ్మిది రోజులగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. టీటీడి వేద పండితులు శనివారం వేకువనే స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం విశేష అలంకార భూషితులైన శ్రీదేవీ, భూదేవీ సమేత స్వామి వారు పుష్పాలతో అలంకరించిన పల్లకిపై కొలువు దీరి ఆలయ మాడ వీధుల్లో వైభవంగా విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సాయంత్రం అలంకార భూషితుడైన దేవదేవుడు వాహన సేవల్లో చివరిదైన అశ్వవాహనంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.వాహన సేవల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఉపప్రధా న అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, అర్చకులు రమేష్‌స్వామి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం




వాల్మీకిపురం, ఫిబ్రవరి 17: పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో వెలసిన కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా వైభవంగా నిర్వహించారు. శనివారం కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా వేదపండితులు అలంకరించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆలయ ట్రస్టు ప్రతినిధులు సారథి, రాధమ్మ, మీనాక్షి, శశికళ, వంశీ, భక్తులు పాల్గొన్నారు.

రథోత్సవంపై శ్రీనివాసుడు ఊరేగింపు

బి.కొత్తకోట,ఫిబ్రవరి17: పట్టణంలోని బీసీ కాలనీలో వెలసిన పద్మావతీ లక్ష్మీదేవి సమేత ప్రసన్న వేంటేశ్వర స్వామి వారు రథోత్సవంపై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. రథసప్తమి వేడుకలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణ, పూజల అనంతరం రాత్రికి పట్టణ వీధులలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు.

ఇస్రోను సందర్శించిన మిట్స్ విద్యార్థులు



కురబలకోట, ఫిబ్రవరి 17: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళా శాలకు చెందిన సీఎస్ ఈ తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు శ్రీహరికోటలోని ఇస్రోని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి టెక్నాలజీపై అవగాహన కల్పించడంతో పాటుగా పోటీ ప్రపంచంలో టెక్నాలజీ ప్రాముఖ్యతను ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో తెలియజేశారు. విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఇవాళ ఇన్సాట్ 3డీఎస్ ఉపగ్రహాన్ని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి పంపగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి

●జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేత రామాంజనేయులు, అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో నానాటికీ పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికి అధికారంలోకి రానున్న జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆపార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయలు పేర్కొన్నారు. జనంకోసం జనసేన కార్యక్రమంలో భాగంగా 61వరోజు శనివారం స్థానిక బెంగళూరురోడ్డు, చిప్పిలి ఏరియాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్దే లేదన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, కుప్పాల శంకర్, కోటకొండ చంద్రశేఖర్, ధరణి, సోను, సుప్రీమ్‌హర్ష, నవాజ్, శేఖర్, బహదూర్, పద్మావతి, ప్రభావతి, సురేఖ, లక్ష్మి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు వెళ్లొద్దంటూ నోటీసులు



సుధాకర్‌కు నోటీసులు ఇస్తున్న పోలీసులు

పీలేరు, ఫిబ్రవరి 17: పాత పెన్షన్ విధానం అమలు కోరుతూ సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన చలో విజయ వాడ కార్యక్రమానికి వెళ్లరాదంటూ కేవీపల్లె పోలీసులు శనివారం పలువురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. విజయవాడలో ఆదివారం జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వ అనుమతులు లేవని, అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీసీపీ ఎస్ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్‌తో పాటు మరికొంత మంది ఉద్యోగులకు నోటీసులు అందజేశా రు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఏపీజేఏసీ ఆధ్వ ర్యంలో జరగనున్న కార్యక్రమానికి విజయవాడ పోలీసు కమిషనర్ నుంచి ముందస్తు అనుమతులు తీసుకున్నప్పటికీ విజయవాడకు వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు నోటీసులు జారీ చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా విజయవాడలో తలపెట్టిన నిరసన కార్యక్ర మం విజయవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఉద్యమాలంటే ఉలికి పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం



నోటీసులు తీసుకొంటున్న యూటీఎఫ్ నాయకుడు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 17: నోటీసులతో ఉద్యమాలను ఆపలేరని, ఉద్యమాలంటే నే రాష్ట్రప్రభుత్వం ఉలికి పడుతుందని యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ అన్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీ ఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18న విజయవాడలో నిర్వహించే ఓట్ ఫర్ ఓపీఎస్ ధర్నా కార్యక్రమానికి వెళ్లకూడదంటూ శనివారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణకు తనస్కూల్ వద్దకు పోలీసులు వచ్చినోటీసులు జారీ చేశారు. ఇలా చేయడం అప్రజాస్వామికం అని ఆయన ఆరోపించారు. జీపీఎస్‌రద్దు చేసి పాతపద్ధతి కొనసాగించాలంటూ రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుంటే నిరంకుశంగా వాటిని అడ్డుకోవడం సమజంసంకాదన్నారు. ఏ పార్టీ అయితే పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీఇస్తుందో వారికే పదిలక్షల ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలు రాబోవు ఎన్నికల్లో మద్దతు తెలుపుతాయని ఆయన పేర్కొన్నారు.

సకల జనుల ర్యాలీని విజయవంతం చేయండి



బి. కొత్తకోటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బి. కొత్తకోట,ఫిబ్రవరి17: మదనపల్లెలో నిర్వహించే సమరభేరి- సకలజనుల ఐక్యతార్యాలీని విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు ప్రజలను కోరారు. బహుజనసేన ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా సాధనకు సహకరించే పార్టీలను గుర్తించడంతో పాటు, మదనపల్లెను మోసం చేసిన అధికార వైసీపీని హెచ్చరించే ఉద్దేశ్యంతో ఈనెల 20న ర్యాలీని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ర్యాలీకి సంబంధించిన గోడపత్రికలను బి కొత్తకోట లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం ఆవిష్కరించారు. మదనపల్లె జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేసి, కేసులలో ఇరుక్కున్న నాయకులకు తోడుగా ప్రతిఒక్కరూ హాజరై తమ గళం విప్పాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎన్ చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్ రెడ్డి, ఆనంద్, ఏఐటియుసీ మండల అధ్యక్షులు రఘునాథ్,నారాయణస్వామి, ఖాదర్, చంద్ర, నరసింహ, చిన్నరెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు ఓటును వినియోగించుకోవాలి



కొత్త ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

కలికిరి, ఫిబ్రవరి 17:యువత భవిష్యత్తు కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని టీడీపీ అనుబంధ విభాగానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఉద్బోధించారు. శనివారం స్థానిక శ్రీనివాసా డిగ్రీ కళాశాల ఆవరణలో కొత్తగా నమోదైన విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అబ్బూరి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కొత్తగా నమోదైన ఓటర్లు అన్ని విధాలా రాష్ట్ర భవిష్యత్తును కాంక్షించి ఓటేయాలని కోరారు. టీఎన్ఎస్ఎఫ్ పీలేరు నియోజకవర్గం అధ్యక్షుడు ఎన్టీఆర్ నఫీజ్, తెలుగు యువత నాయకుడు క్రాంతి మాట్లాడుతూ అన్ని విధాల దార్శనికుడుగా ముద్రపడిన చంద్రబాబు నాయుడును ఎన్నుకోవలసిన ఆవశ్యకత ఉందని చెప్పారు. కార్యక్రమంలో మండల మైనారిటీ ఉపాధ్యక్షుడు మోదీన్ బాషా, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు రాకేష్, శివ, యువ నరసింహ, రెడ్డి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజసేవ లయన్స్ క్లబ్ లక్ష్యం



ఆదర్శ ఉమెన్స్ సొసైటీకి విరాళం అందజేస్తున్న దాతలు

కలకడ, ఫిబ్రవరి 17:సమాజసేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని ఆ సంస్థ జిల్లా గవర్నర్ డాక్టర్ రామరాజు అన్నారు. శనివారం కలకడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సభ్యుడు సేవాభావం కలిగి తనకు నిర్దేశించి లక్ష్యాలను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. 23 మంది సభ్యులతో ప్రారంభమై ఆ సంఖ్య 35 మందికి చేరుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. అంతకుముందు మదనపల్లెలోని ఆదర్శ ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీకి లయన్ గాలి ఆనంద్‌రావు, లయన్ ముల్లంగి విజయ్‌లు రూ.10వేలు చొప్పున విరాళం అందజేశారు. అలాగే అధ్యక్షుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు మండలంలోని మూడు ఆలయాలకు రూ.30 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు నరేష్, రాజారెడ్డి, పునీత్‌చౌదరి, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, లయన్‌లు బరకం శ్రీనివాసులరెడ్డి, మురళీమోహన్, రెడ్డిశేఖర్, మాసుమ్ రఫీ, సుధాకర్‌నాయుడు, వెంకటేశ్వరరావు, శారద, వైవిరమణ తదితరులు పాల్గొన్నారు.

వేప చెట్లు నరికివేతపై తహశీల్దార్‌కు ఫిర్యాదు



దేవప్పచెరువులో అక్రమంగా నరికివేసిన వేప చెట్టు దుంగలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 17:చెరువులో ఉన్న వేప చెట్లను అక్రమంగా నరికేశారంటూ మజ్జిగవారిపల్లె గ్రామస్థులు శనివారం తహశీల్దార్ శ్రీనాథ్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ మజ్జిగవారిపల్లెలో దేవప్పచెరువు పది ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉంది. ఈ చెరువును అక్రమార్కుల చాలా వరకు ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో చెరువులో పెద్ద పెద్ద వేప చెట్లు ఉండగా ఈ చెట్లను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా శుక్రవారం నరికేసి సమీపంలో ఓ చోట నిల్వ చేసినట్లు నట్లు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే చెట్లు నరికేసిన విషయం వీఆర్వోకు తెలిపిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వ భూమిలోని చెట్లను నరికేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.